క్లుప్తంగా

షబ్బీర్‌అలీని కలిసిన కాంగ్రెస్ నేతలు



షబ్బీర్ అలీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన షబ్బీర్ అలీని శనివారం షాద్ నగర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మైనార్టీ నేత మహ్మద్ ఇబ్రహీం ఆధ్వర్యంలో పలువురు నేతలు హైదరాబాద్‌లోని షబ్బీర్ అలీ కార్యాలయానికి వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



హోమం నిర్వహిస్తున్న పూజారులు

షాబాద్: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలో భారత్‌కాలనీలో హనుమాన్ దేవాయంలో జస్టిస్ కొండా మాధవరెడ్డి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని గీత జ్ఞాన యజ్ఞంలో భాగంగా హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సమాజసేవలో పాల్గొనాలన్నారు. మనిషిలా బతకడం నేర్పేదే భగవద్గీత అని అన్నారు. ఈ పూజలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం ఎంతో గొప్పది

ఎంఈఓ శంకర్‌రాథోడ్



పాఠశాలకు వంట పాత్రలను అందజేస్తున్న శ్రీశైలం

షాద్‌నగర్ రూరల్: సమాజంలో సేవాగుణం ఎంతో గొప్పదని ఎంఈఓ శంకర్‌రాథోడ్ పేర్కొన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాలకు శనివారం ఎంపీటీసీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావలిశ్రీశైలం వంట పాత్రలు, తరగతి గదికి చెత్త డబ్బాలు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌రాథోడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాదృక్పథాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమాజంలో ఎంతో మంది ధనికులు ఉంటారని, కానీ దానగుణం అందరిలో ఉండదన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు నిరుపేద విద్యార్థులే వస్తారని, వారికి కావాల్సిన వసతులను కల్పించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని చెప్పారు. జీవితంలో మనం ఎంత సంపాదించినా కలగని సంతృప్తి ఇతరులకు సేవ చేయడంలో కలుగుతుందన్నారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిప్రసాద్‌యాదవ్, ప్రధానోపాధ్యాయురాలు సక్కుబాయి, ఉపాధ్యాయులు శ్రీదేవి, గీతమ్మ, అరుణ, బుగ్గమ్మ, జ్యోతిలక్ష్మి, మహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చిత్రపటం బహూకరణ



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు చిత్రపటం బహూకరిస్తున్న అశోక్

షాద్‌నగర్ రూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే అభిమాని లింగారెడ్డిగూడ అశోక్ ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అశోక్ ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్‌ను పూలమాలవేసి శాలువా కప్పి సత్కరించి ఆయన చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహ్మద్‌అలీఖాన్‌బాబర్, అందెమోహన్, సయ్యద్‌ఖదీర్ పాల్గొన్నారు.

ఘనంగా ఫ్లవర్స్ డే

షాద్‌నగర్ రూరల్: పట్టణంలో భాగ్యనగర్‌కాలనీలోని క్రిష్ణవేణి ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ రఫత్‌సుల్తానా ఆధ్వర్యంలో శనివారం ఫ్లవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు రంగురంగుల పూలతో అలంకరించుకొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

'మీ సేవ'కు దండం!

- మూడేళ్ల క్రితం ఒక సెంటర్ సీజ్
- మరో కేంద్రం నిర్వాహకుడి మృతి
- మండల వ్యాప్తంగా ఒకటే కేంద్రం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



రెడ్డిపల్లి మీ సేవ కేంద్రం వద్ద బారులు

మొయినాబాద్: మండల పరిధిలో 28 గ్రామ పంచాయతీలున్నాయి. మండల జనాభా సుమారు 70వేల పైనే ఉంటుంది. కానీ ఒకే మీసేవ కేంద్రం ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మండలంలో మూడు మీసేవ కేంద్రాలు ఉండేవి. మూడేళ్ల క్రితం ఓ మీసేవ కేంద్రాన్ని జిల్లా అధికారులు సీజ్ చేయగా మరో మీసేవ కేంద్రం నిర్వహకుడు మరణించడంతో మూడున్నర ఏళ్లగా మూతపడింది. ప్రస్తుతం రెడ్డిపల్లిలో ఉన్న ఒ కేంద్రం మాత్రమే కొనసాగుతోంది. ప్రస్తుతం ఏ దరఖాస్తు చేయాలన్నా మీసేవ కేంద్రమే ప్రధానం. ఒకే సెంటర్ ఉండడంతో విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పరీక్ష రాశాక రద్దు

హిమాయత్‌నగర్ మీసేవ కేంద్రం నిర్వాహకుడు మూడేళ్ల క్రితం మృతి చెందాడు. ప్రభుత్వం ఏడాదిన్నర క్రితం కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చింది. చాలా మంది దరఖాస్తు చేసుకుని పరీక్ష రాశారు. కాగా ఈ కేంద్రాన్ని స్థానికేతరులకు కేటాయించారని కొంత మంది తహసీల్దార్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ప్రక్రియను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. ఇప్పటి వరకు మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వలేదు. మొయినాబాద్ మండల కేంద్రంలోని మీ సేవా సెంటర్‌ను కలెక్టర్ సీజ్ చేయడంతో నిర్వాహకుడు కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నాడు. దీంతో మొయినాబాద్‌లో మీసేవ కేంద్రం నిర్వహించేందుకు స్టే అడ్డంకిగా మారింది.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

స్కూళ్లు, కాలేజీల్లో చదివే విద్యార్థులు కులం, ఆదాయం, నివాసం, పుట్టిన తేది సర్టిఫికెట్లకోసం మీసేవ కేంద్రాల్లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీనికి తోడు రెవెన్యూకు సంబంధించిన చాలా దరఖాస్తులను మీసేవ కేంద్రంలోనే చేసుకోవాలి. దీంతో విద్యార్థులు, రైతులు చాలా మంది రెడ్డిపల్లి మీసేవ కేంద్రం వద్దకే వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఎక్కువ సమయం వేచి ఉండలేక అసహనానికి గురవుతున్నారు. కొంత మంది ఇతర మండలాల్లోని మీసేవ కేంద్రాలకు వెళ్తున్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మండలంలో ఒకే మీసేవ కేంద్రం ఉండడం వల్ల రైతులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెడ్డిపల్లిలో మీసేవ కేంద్రం ఉండటంతో చాలా గ్రామాల ప్రజలు అంత దూరం వెళ్లడం ఇబ్బందిగా మారింది. గతంలో ఉన్న మీసేవ కేంద్రాలను తెరిపించేందుకు అధికారులు కృషి చేయాలని. మండలంలో మరికొన్ని కొత్త మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

– ఫెరోజ్, మొయినాబాద్

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



ప్రస్తుతం ఒకే మీసేవ కేంద్రం ఉంది. మొయినాబాద్ మీసేవ కేంద్రంపై కోర్టు స్టే ఉంది. హిమాయత్‌నగర్ మీసేవ కేంద్రానికి సంబంధించి మళ్లీ నోటిఫికేషన్ వేసే అవకాశం ఉంది. మండలంలో మీసేవ కేంద్రాల అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

– గౌతమ్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయండి

ఏబీవీపీ మండల కన్వీనర్ నరేష్‌చారి



మాట్లాడుతున్న నరేశ్‌చారి

కొత్తూరు: కొత్తూరు మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసే విధంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవ తీసుకోవాలని ఏబీవీపీ మండల కన్వీనర్ నరేష్‌చారి పేర్కొన్నారు. శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానికంగా జూనియర్ కళాశాల లేని కారణంగా పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది విద్యార్థులు ఉన్నత విద్య కోసం నిత్యం బస్సుల్లో షాద్‌నగర్, శంషాబాద్, హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు ఇబ్బందులు పడుతూ వెళ్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు కళాశాలకు వెళ్లే సమయంలో సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ సమస్యలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇక్కడ కళాశాల ఏర్పాటు చేయని యెడల ఏబీవీపీ ఆధ్వర్యంలో విడతల వారీగా ధర్నా, ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు, ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే కళాశాల ఏర్పాటు చేసేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శివకుమార్‌చారి, హర్షకుమార్, సుమిత్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం వనంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన అఖిలోద్దీన్ సానియా ఫిర్దోషి ప్లేట్లు, గ్లాసులు, బ్యాగులు, వాటర్ బాటిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తులసికృష్ణ మాట్లాడుతూ గ్రామంలో పనిచేస్తున్న ఆశా కార్యకర్త నూర్జాహన్ బేగమ్ కుమారులు విద్యార్థుల సౌకర్యార్థం రూ.10వేలతో మధ్యాహ్న భోజన కిట్లు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కవిత, గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు శేఖర్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న దాతలు

ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధి

సర్పంచుల సంఘం మాజీ ఉపాధ్యక్షురాలు, హిమాయత్‌నగర్ మాజీ సర్పంచ్ మంజుల



మంజులరవియాదవ్‌ను సన్మానిస్తున్న వివిధ సంఘాల నాయకులు

మొయినాబాద్ రూరల్: హిమాయత్‌నగర్ గ్రామ అభివృద్ధి అందరి సహకారంతోనే సాధ్యమైందని సర్పంచుల సంఘం మాజీ ఉపాధ్యక్షురాలు, హిమాయత్‌నగర్ మాజీ సర్పంచ్ మంజుల పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో పలు యువజన సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మంజుల రవియాదవ్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే అదృష్టం అందరికీ రాదని ఇది కొందరికే లభిస్తుందన్నారు. ఎన్నికల్లో 10మంది అభ్యర్థులు పోటీలో ఉంటే గెలిచేది ఒక్కరు మాత్రమేనని చెప్పారు. గ్రామ ప్రజలు తనను గెలిపించి గ్రామానికి ఐదు సంవత్సరాల పాటు సేవ చేసే అదృష్టాన్ని కల్పించినందుకు ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శాఖలు, అధికారుల పనితీరు బాగుంది



మొయినాబాద్ మండల పరిషత్ సమావేశంలో ఎంపీడీఓ సంధ్యతో మహారాష్ట్ర అధికారుల బృందం

మహారాష్ట్ర జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధుల బృందం కితాబు

మొయినాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు, అధికారుల పనితీరు బాగుందని మహారాష్ట్ర జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల బృందం కితాబిచ్చింది. రాజేంద్రనగర్‌లోని గ్రామీణాభివృద్ధి సంస్థలో ప్రభుత్వ శాఖలు, వాటి పనితీరుపై మహారాష్ట్ర జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధుల బృందం శిక్షణ పొందుతుంది. ఈ శిక్షణలో భాగంగా శనివారం అధికారులు, ప్రజా ప్రతినిధుల బృందం సభ్యులు మొయినాబాద్ మండలంలోని చిలుకూరులో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. చిలుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ ఆ గ్రామంలో ఏయే శాఖల అధికారులు ఉంటారు, ఎవరెవరు ఏయే పనులు చేస్తారు? గ్రామస్థాయిలో ప్రజా ప్రతినిధులు ఏయే బాధ్యతలు నిర్వహిస్తారనే విషయాలపై పంచాయతీ అధికారులు, కార్యదర్శులు, ఇతర సిబ్బందితో చర్చించి తెలుసుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య ఉండే సమన్వయం, గ్రామ పంచాయతీ స్థాయిలో జరిగే సమావేశాల గురించి తెలుసుకున్నారు. అధ్యాయనంలో పూర్తి వివరాలు తెలుసుకున్న అధికారులు, ప్రజాప్రతినిధుల బృందం సభ్యులు మాట్లాడుతూ తెలంగాణలో ప్రభుత్వ శాఖలు, అధికారులు, ప్రజా ప్రతినిధుల పనితీరు బాగుందన్నారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా గ్రామాల్లో చేపట్టే అంతర్గత మురుగు కాలువలు, సీసీ రోడ్లు, పంచాయతీ రోడ్ల నిర్మాణ పనులు బాగున్నాయన్నారు. టీఎస్‌ఐఆర్‌డీ సీఈఓ ఉమారాణి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, కారోబార్ రాజేష్ పాల్గొన్నారు.



చిలుకూరు గ్రామ పంచాయతీ భవనాన్ని సందర్శించిన మహారాష్ట్ర అధికారుల బృందం

మొయినాబాద్ రూరల్: మొయినాబాద్ మండలాన్ని సందర్శించిన మహారాష్ట్ర అధికారుల బృందం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం సందర్శించింది. తెలంగాణలో పలు అవార్డులు ఎలా వచ్చాయని, వాటిని అధికారులు ఎలా సంపాదించుకున్నారు? అనే కోణంలో అడిగి తెలుసుకున్నారు. మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సంధ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండల అధికారులు పాల్గొని మాట్లాడారు. అభివృద్ధిపై ఎంపీడీఓ సంధ్య మహారాష్ట్ర అధికారుల బృందానికి వివరించారు.

బీజేపీ ప్రభుత్వంతోనే దేశాభివృద్ధి

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంతోనే దేశాభివృద్ధి సాధ్యమని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని వీరయ్యఫంక్షన్‌హాల్‌లో శనివారం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీయే ప్రధానిగా కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో అత్యధిక స్థానాలతో బీజేపీని గెలిపించాలన్నారు. ప్రతిఒక్కరూ పార్టీకోసం కష్టపడి పనిచేయాలని కోరారు. పార్టీ కోసం పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. గ్రామాల్లో బీజేపీకి బలమైన యువ శక్తి ఉందని ప్రజల్లో బీజేపీ అంటే ప్రత్యేక అభిమానం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ప్రతీకార్యకర్త కష్టపడి చేవెళ్ల ఎంపీగా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, కృష్ణగౌడ్, దేవుని శర్వలిగం, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, మండల దళిత మోర్చా అధ్యక్షుడు అశోక్, ఓబీసీ అధ్యక్షుడు కుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమతో మంచి లాభాలు

సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్



రైతులతో మాట్లాడుతున్న రత్నాకర్

షాబాద్: పాడి పరిశ్రమతో రైతులకు మంచి లాభాలు వస్తాయని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామంలో పాడి రైతులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుగుణ మాల రైతు ఉత్పత్తి దారుల సంఘం ఏర్పాటు, పాడి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయంతో పాటు 1లేదా 2 పాడి పశువులను పెంచుకోవాలన్నారు. మిశ్రమ వ్యవసాయ పద్ధతిలో పాడి పశువులను వ్యవసాయ ఉత్పత్తులతో పెంచి అదనపు ఆదాయం, ఉపాధి పొందొచ్చన్నారు. వర్షపాతం లేకపోవడంతో నష్టం జరిగినప్పుడు రైతులకు పాడి పశువుల నుంచి వచ్చే ఆదాయం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుగుణ మాల రైతు ఉత్పత్తి దారుల సంఘం డైరెక్టర్లు లింగం, మల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, అంజయ్య, రాములు, రాంచంద్రయ్య, మాధవరెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజరత్నం, శంకర్, రథోడ్ తదిరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. శనివారం స్థానిక సీహెచ్‌సీలో వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సర్కారు దవాఖానలకు నిరుపేదలు వస్తుంటారని, వారికి నాణ్యమైన చికిత్స అందించాలన్నారు. నిరుపేదల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం అనేకచర్యలు చేపడుతుందని, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వైద్యులు పని చేయాలని కోరారు. సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ యూన్సి, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7న నిర్వహించే మాతా రమాబాయి అంబేడ్కర్ జయంతి కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ చేసిన ప్రతి పోరాటంలో రమాబాయి త్యాగం ఉందని తెలిపారు. కార్యక్రమంలో యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేశ్, జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, శ్రీనివాస్, జగన్, ప్రశాంత్, రాజు, రమేష్, నరేష్, క్రాంతి, దినకర్, సాయితేజ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు కీలకం



పాలకవర్గం సభ్యులను సన్మానించిన ఎంపీపీ

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మక్తగూడ గ్రామంలో శనివారం మాజీ సర్పంచు రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా పదవీ కాలం పూర్తిచేసుకున్న పంచాయతీ పాలకవర్గం సభ్యులను ఆయన, గ్రామ యువకులు శాలువాకప్పి సన్మానించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే ప్రతీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవడంలో సర్పంచులు ప్రముఖంగా వ్యవహరిస్తారని తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాలను విజవంతం చేయడానికి సర్పంచులు పడే కష్టం వెలకట్టలేనిదన్నారు. ఆయా అభివృద్ధి పనులు, వేతనాలకు ప్రభుత్వం నుంచి నిధులు ఆలస్యమైనప్పటికీ కొందరు సర్పంచులు తమ సొంత డబ్బులను ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం సభ్యులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి

కందుకూరు: నియోజకవర్గంలో రహదారులను అభివృద్ధి చేసేలా నిధులు కేటాయించాలని పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు.



సమ్మెను విజయవంతం చేయండి

గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్

కేశంపేట: కార్మిక హక్కుల సాధనకై ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెలో ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ వర్కర్స్‌తో మండల అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. కార్మికులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఈ సమ్మెలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు యెన్నం శ్రీధర్‌రెడ్డి, జంగయ్య, రోశయ్య, పరేషా, రమేష్, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: కార్మికుల హక్కుల సాధనకు దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న భారత్‌బంద్‌లో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని గ్రామ పంచాయతీ యూనియన్ రాష్ట్ర నాయకుడు నర్సింహ్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇందులో భాగంగా ఆయన పలువురు కార్మికులతో కలిసి ఎంపీడీవో శరత్‌చంద్రబాబుకు సమ్మె కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, దేవయ్య, రాములు, భిక్షపతి, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట: ఎంపీడీఓకి సమ్మె నోటీస్ అందజేస్తున్న రాంచందర్

కొందుర్గులో..

కొందుర్గు: గ్రామీణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో 16న నిర్వహించే గ్రామీణ బంద్ కార్యక్రమానికి సంబంధించి కొందుర్గు ఎంపీడీఓ ఆంజనేయులుకు, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణయ్యకు అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు బుద్దుల జంగయ్య సమ్మె నోటీస్ అందజేశారు. చౌదరిగూడలో సీఐటీయూ మండల కార్యదర్శి రాయికంటి గోపాల్ ఎంపీడీవోకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. రజియా, యామిని, సువర్ణ, నాగమణి, ప్రమీల, యాదయ్య, వీరేశ్, జంగయ్య, పాపయ్య, పార్వతమ్మ, శ్రీను పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు